అహంకారం ఇలాకొంపలుముంచేస్తుంది, అహంకారం తీసుకొని వచ్చేప్రమాదం ఇలా ఉంటుంది, వాడి అహంకారమే వాడికి మరణాన్ని తీసుకొనివచ్చింది. అహంకారం ఉంటే అంతా ఉంది, అదిలేకపోతే ఏదీలేదు అని నోటితో చెపుతున్నాము కాని ఇది అనుభవంలోనికి రావటం చాలా కష్టం.

నేను ధనవంతుడిని, నాకు పదవివచ్చింది, మేము గౌరవంగా బతుకుతున్నాము, మేము పేదవారము అని మనం ఇలా ఏదోఒకటి పిచ్చిపిచ్చి విషయాలు అనుకొంటూ ఉంటాముకదా. ఇలా ఏమీ అనుకోకుండా, శూన్యంగా ఉంటే, నేను ఏదికాదు అనుకొంటే దేవుని దయమనమీదవర్షిస్తుంది. వర్షం కురిసినప్పుడు వర్షంలో ఉంటే ఎలాతడిసిపోతామో అలాగ నీవు ఏదీకాదు అని నీకుఅర్ధమయినప్పుడు దేవుని అనుగ్రహంతో తడిసిపోతావు, ఆయన అనుగ్రహం వచ్చి నిన్ను ముంచేస్తుంది. భక్తులు నాదగ్గరకు వచ్చి భగవంతుడి గురించి కాకుండా ఇంట్లోసమస్యలు ఏవోచెపుతూఉంటారు. మన ఇంట్లో దోమలు ఉన్నాయి అనుకోండి, ఈగలు ఉన్నాయి అనుకోండి మందుపెట్టివాటిని తోలేసిన మరల అవి వచ్చేస్తూనే ఉంటాయి, ఈసమస్యలుకూడా అంతే. అహంకారం ఉన్నంతసేపు సమస్యలు వస్తూఉంటాయి. ఒకసమస్యను పరిష్కరించుకొంటే ఇంకోసమస్య వస్తూఉంటుంది. అహంకారం ఉన్నంతసేపు, దేహాభిమానం ఉన్నంతసేపు ప్రతీజన్మలోనూ ఈ సమస్యలు నిన్ను వెంటాడుతూ ఉంటాయి, మనం ఎవరినో విమర్శించే బదులు మనలోని లోపాలను చూసుకొని వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నంచేయాలి, అదిసాధకుడి లక్షణం. మనం జీవితం పొడుగునా కష్టపడి సాధనచేసి సంపాదించవలసింది ఏమిటి అంటే అంతఃకరణశుద్ధి. మన అంతఃకరణాన్ని నిర్మలంగా ఉంచుకోవటానికి ఏదిచెయ్యాలి, ఏదిచేయకూడదు, మనప్రవర్తన ఎలా ఉండాలి అనేది వేదంలో చెప్పబడింది. ఆ ప్రకారం మనం జీవించటానికి ప్రయత్నంచేయాలి. మనం మౌనంగా ఉండగలిగితే మౌనం వలన కూడా కొన్నిసమస్యలు పరిష్కారమవుతాయి. ఒక భక్తుడు భగవాన్‌ను చాలాసార్లు ప్రశ్నించాడు కాని ఆయన సమాధానం చెప్పలేదు. అప్పుడు ఆ భక్తుడు ఏమన్నాడు అంటే నేను చాలాసార్లు అడుగుతున్నాను కాని మీరు సమాధానంచెప్పటంలేదు, భగవంతుడు ప్రేరేపించటం వలన ఈప్రశ్న అడుగుతున్నాను అని చెప్పాడు. అప్పుడు భగవాన్ ఏమన్నారు అంటే ఏ భగవంతుడు అయితే నిన్ను అడగమని ప్రేరేపిస్తున్నాడో ఆభగవంతుడే జవాబు చెప్పవద్దని నన్ను ప్రేరేపిస్తున్నాడు, ఆయన ఈయన వేరుకాదు అని చెప్పారు. భగవాన్ కొన్ని ప్రశ్నలకు జవాబు చెప్పేవారుకాదు. మనం ఏదైనా చెప్పినా వాడికి అర్థం అవ్వదు అనుకొన్నప్పుడు, ఆమాట వివాదాలకు దారితీస్తుంది అనుకొన్నప్పుడు ఆయన మౌనంగా ఉండేవారు. నాకు ఆనందం కావాలి అనిఒకరు భగవాన్‌ను అడిగితే నీ ఆనందానికి ఎవరు



అడ్డురావటంలేదు నాకు ఆనందంకావాలి అని ఎవడైతే అడుగుతున్నాడో వాడిని తీసి ఒకప్రక్కనపెట్టు, అప్పుడు ఉన్నదే ఆనందం అన్నారు. అకారం, ఉకారం, మకారం కలిసి ఓంకారం అవుతుంది. కొంతమంది అకారానికి ప్రాముఖ్యత ఇస్తారు, కొంతమంది మకారానికి ప్రాముఖ్యత ఇస్తారు. లోకంలోని సంపదలు, గౌరవాలు కావాలంటే అకారానికి ప్రాముఖ్యత ఇవ్వండి, మీకు బ్రహ్మజ్ఞానం కావాలంటే మ కారానికి ప్రాముఖ్యత ఇవ్వండి అని కొంతమంది పెద్దలు చెపుతారు. ప్రపంచాన్ని మీరు కలక్రిందే చూడండి, మీరు కలక్రింద చూడగా చూడగా కొన్నాళ్లకు నిజంగా కలక్రిందే కనిపిస్తుంది అని ఉపనిషత్‌లో చెప్పారు. జాగ్రదవస్థ, స్వప్నావస్థ, గాఢనిద్ర ఈమూడు అవస్థలకు ఆధారంగా భగవంతుడు ఉన్నాడు, వాడే అంతర్యామి, అంతర్యామిగా ఉన్నవాడిని పట్టుకోవాలి. మనం ఏదైనా అశాంతికి గురి అవుతూఉంటే, దుఃఖానికి గురిఅవుతూఉంటే, మనం చావుపుట్టుకలకు గురిఅవుతూఉంటే వీటి అన్నింటికి కారణం ఒక్కటే, అది తప్పడుతాదాప్యం, మనం కానిదానితో తాదాప్యం పొందటం వలన ఈ చిక్కు అంతావస్తోంది, ఇది అర్ధమయితే మీ మనస్సు అణిగిపోతుంది, ఆత్మజ్ఞానం ఉదయిస్తుంది. మనం ఎన్ని మంచిపనులు చేసినా చివరకు ఆత్మజ్ఞానం దగ్గరకు రావాలి. మంచిపనులు ఎందుకు చేస్తున్నాము అంటే చిత్తశుద్ధి కోసం, చిత్తశుద్ధి వలన ఆత్మజ్ఞానం కలుగుతుంది. మీ గురించి మేము ఇక్కడకు వచ్చాము అని ఎవరైనా భగవాన్‌తో అంటే మరి నేను ఎవరి గురించి వచ్చాను అనేవారు. నన్ను ఎవడైతే తీసుకొని వచ్చాడో వాడే మిమ్మల్ని తీసుకొని వచ్చాడు, నేను ఎవడిని మిమ్మల్ని తీసుకొనిరావటానికి, ఉన్నది ఒక్కటే అదే అంతటా ఉంది, మన హృదయంలోను ఉంది. మన ఇష్టాలు అయిష్టాలు తగ్గించుకొంటే మనస్సువెళ్ళి దాని గూటిలో పడిపోతుంది. పడిపోవటమేకాదు, అక్కడ నిలబడి ఉంటుంది, అలా ఉండటం వలన మనస్సు నశిస్తుంది, ఆత్మజ్ఞానం కలుగుతుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 20-6-04, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

శ్రద్ధలేకుండా, క్రమశిక్షణ లేకుండా అసలు జ్ఞానంరాదు, గాంధీగారు మహాత్ముడు అయ్యాడు, తిలక్‌గారు లోకమాన్యుడు అయ్యాడు అంటే వారూ మనలాంటివారే కాని క్రమశిక్షణ వలన, సాధనాబలంవలన అంతటివారు అయ్యారు. మాట దగ్గర, పనిదగ్గర క్రమశిక్షణ ఉండాలి. ప్రపంచంతో మనకు ఉన్న సంబంధం ప్రేమపూరితంగా, శాంతిపూరితంగా ఉండాలి. మీరు ఇతరులను భయపెట్టవద్దు, ఇతరులను చూసి మీరు భయపడవద్దు అని భగవంతుడు చెప్పాడు, ఇవి రెండూ మనం నేర్చుకోవాలి. స్వార్ధ పరులు వారి స్వార్ధం కోసం ఎంత కష్టపడి పనిచేస్తారో అలాగ ఇతరులకోసం కష్టపడి పనిచేస్తే

వాడు మహాత్ముడు అవుతాడు, వాడికి ఆత్మజ్ఞానం కలుగుతుంది. మీరు ఇంటిదగ్గర పనిశ్రద్ధగా చేసుకొంటున్నారు అలాగే భగవంతుడు చెప్పినమాట యందు మనకు శ్రద్ధ ఉండాలి, ఆమాటను మననం చేసుకొని అనుభవంలోనికి తెచ్చుకొంటేవాడు బాగుపడతాడు, వాడికి ఆత్మజ్ఞానం కలుగుతుంది. మనం నోటితో మాట్లాడేమాట, చేతితో చేసేపని, మనకు వచ్చే తలంపులు ప్రీతిగా ఉండాలి, ప్రియంగా ఉండాలిగాని అప్రియంగా ఉండకూడదు. ఈ మనస్సు, ప్రాణం, దేహం, లోకం, ధర్మాలు, అధర్మాలు, పుణ్యాలు, పాపాలు ఇవి అన్నీ అహంకారానికే. వీటితో ఇసుమంతయు సంబంధంలేకుండా సత్యం ఉంది, అది స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఉంది. అది ఉండటంవలననే అది తెలియబడుతుంది కాని బయట ప్రకాశం దానికి అక్కరలేదు. అది స్థిరంగా ఉంటుంది, ఏకంగా ఉంటుంది, దానికి చావు ఎలా ఉంటుందో, పుట్టుక ఎలా ఉంటుందో తెలియదు, దాని స్వరూపం శాంతి, దాని స్వరూపం ఆనందం, దాని స్వరూపం జ్ఞానం. కాని అది మన తెలివికి, మన ఇంద్రియాలకు, మన మనస్సుకు అందదు. నాకు ధ్యానం బాగా సాగటం లేదు అని అంటాము అనుకోండి, ధ్యానం బాగా సాగకపోవటానికి నీలోపల ఉన్న చైతన్యం ఏమీ అడ్డురావటంలేదు, నీ మనస్సు, నీ ఇంద్రియాలు, నీరాగద్వేషములు అడ్డువస్తున్నాయి, ధ్యానం చేసేటప్పుడు నీకు ఎవరు అడ్డువస్తున్నారో జాగ్రత్తగా చూసుకొని దానిని తొలగించుకోవాలి, దీనికి బుద్ధిసూక్ష్మత అవసరం. బుద్ధిసూక్ష్మతలేకుండా, వివేకంలేకుండా, వైరాగ్యంలేకుండా నీకు జ్ఞానంకలుగదు. మన ప్రాణం పోయే సమయంలో ఒక్కదైవచింతన తప్పించి ఏదీ రాకూడదు, ఏదైనా ఒక వస్తువుగాని, ఒక వ్యక్తిగాని జ్ఞాపకం వస్తూఉంటే మనకు వైరాగ్యం లేనట్లు గుర్తు. మనవారు ఎవరూలేరు. మనం కూడా ఎవరి వారముకాదు, మనం కళ్ళుమూస్తే ఏమీలేదు. సర్వత్రా సమబుద్ధి ఉన్నవాడికి కాని వైరాగ్యంరాదు. మనం ఈలోకంలోనికి డ్యూటీ చెయ్యటానికి వచ్చాము. మన డ్యూటీ మనం శ్రద్ధగా చేసుకొని వెళ్ళిపోవాలి కాని డ్యూటీ విషయంలో సోమరితనం ఉంటే భగవంతుడు రాబోయే జన్మలో ఇదే పనిని మనకు ఇస్తాడు. కర్మమనిషిని విడిచిపెట్టాలిగాని మనిషికర్మను విడిచిపెట్టకూడదు అని రామకృష్ణుడు చెప్పారు. దానిని బలవంతంగా విడిచిపెడితే వచ్చేజన్మలో అదే నిన్ను పట్టుకొంటుంది అని చెప్పారు. లోకం అంటే మంచీ చెడ్డా ఉంటాయి, పుణ్యపాపములు ఉంటాయి, చీకటి వెలుగు ఉంటుంది. వీటి అన్నింటిని మనం జాగ్రత్తగా ఓవర్‌కమ్ చేస్తూ ఈవికారములన్నింటిని అతిక్రమిస్తూ లోచూపు నేర్చుకొని హృదయగుహలోనికి వెడితే ఆ గుహేశుడు మనకు దర్శనమిస్తాడు. అందుచేత మీరు జపధ్యానములు విడిచిపెట్టవద్దు. గణపతిశాస్త్రిగారు చనిపోయే రోజున ఆయన కుమారుడు, నన్ను ఎలా జీవించమంటారు అని ఆయనను అడిగితే నువ్వు ఎంతకాలం అయితే జీవించి ఉంటావో అంతకాలం జపధ్యానములు విడిచిపెట్టవద్దు అని



చెప్పారు. ఆత్మజ్ఞానసముపార్జనకు, మనం ఎవరిమో మనం తెలుసుకోవటానికి జపధ్యానములు సహకరిస్తాయి.

భగవంతుడు అంతటా ఉన్నాడు. అందరిలోను అంతర్యామిగా ఉన్నాడు. కాని మనకు చూసే జ్ఞాననేత్రంలేదు. మనకు శాస్త్రం ప్రమాణంకాని మనబుద్ధి ప్రమాణంకాదు. మనం రోజుకు పదిరకాలుగా ఉంటాము, మనది పాడుబుద్ది. నీకు జ్ఞానం కావాలంటే నీ బుద్ధిని, నీ మనస్సును, నీ ఇంద్రియాలను ప్రమాణంగా పెట్టుకోవద్దు. బుద్దిలో స్థిరత్వంలేనివాడికి, బుద్ధిలో నిర్మలత్వం లేనివాడికి, బుద్దిలో నిదానం లేనివాడికి జ్ఞానాదోయం అయ్యే అవకాశం లేదు. భగవంతుడు మనకు జ్ఞానం ఇవ్వటానికి సిద్దంగా ఉన్నాడు. కాని మీరు ఏమనుకొంటున్నారు అంటే మనకు ఇంకా ఇవ్వటంలేదు ఏమిటి అనుకొంటున్నారు. భగవంతుడు ఇస్తాడుకాని మీరు ఎక్కడ దాచుకొంటారు? మీకు ఎవరైనా పుస్తకం ఇస్తే టేబుల్ మీద పెట్టుకొంటారు, ఎవరైనా పళ్ళు ఇస్తే పొట్టలో పెట్టుకొంటారు. మీకు ఎవరైనా డబ్బు ఇస్తే పెట్టెలో పెట్టుకొంటారు. అలాగే మీకు భగవంతుడు జ్ఞానం ఇస్తాడు, మీరు ఎక్కడ పెట్టుకొంటారు? తల్లిప్రేమకంటే భగవంతుడు ప్రేమ ఉదాత్తమైనది, చంటిపిల్లవాడిని ఎత్తుకుంటే వాడు తల్లిని తన్నుతూ ఉంటాడు కాని తల్లి ఏమీ అనుకోదు. భగవంతుడు కూడా అట్టివాడే, గురువుకూడా అట్టివాడే. భగవంతుడు జ్ఞానాన్ని ఇస్తాడు కాని 24 గంటలు లోకంగొడవలతో తిరిగే మనకు, జ్ఞానం పెట్టుకోవటానికి మన హృదయంలో ఖాళీ ఎక్కడ ఉంది. మన హృదయం ఖాళీగా ఉంటే, అంతఃకరణం శుచిగా ఉంటే భగవంతుడు జ్ఞానాన్ని ఇస్తాడు, అక్కడ పెట్టుకోవచ్చు. చిత్త శోధకం ముక్తి సాధకం, చిత్తాన్ని శోధించకుండా ముక్తి సాధింపబడదు. ఎప్పుడైతే చిత్తం నిర్మలంగా ఉందో, చిత్తం శుద్ది అయ్యిందో అప్పుడు ముక్తి నిన్ను వరిస్తుంది, మీరు ధర్మాన్ని ఆచరిస్తే మీకు బ్రహ్మ జ్ఞానం కలుగుతుంది, ధర్మాన్ని ఆచరించకుండా మీకు జ్ఞానం కలిగే అవకాశంలేదు అని ఆచార్యులవారు చెప్పారు. మనలను నియమించేవాడు మన హృదయంలోనే ఉన్నాడు. ఆయనను ఉపాసించు ఆయన మన ఇంద్రియాలకు అందడుకాని ఇంద్రియాలు అణిగితే ఆయన అందుతాడు, మనస్సుకు అందడుగాని మనస్సు అణిగితే ఆయన అందుతాడు. శాస్త్రంలో ఏమి చెప్పారు అంటే బుడగకి ఆధారంగా సముద్రం ఉంది, అలాగే నేను అనే తలంపుకు ఆధారంగా నీలోపల చైతన్యం ఉంది. బుడగ అణిగిపోతే సముద్రం అయిపోతుంది. అలాగే ఈ మూలతలంపు అణిగిపోతే నువ్వు చైతన్య స్వరూపుడవు అయిపోతావు. ఇప్పుడు మనం ఒక రూపానికి ఒక నామానికి పరిమితమై ఉన్నాము. మనం సాధనచేసి ఈ రూపబుద్దిలోనుండి, నామబుద్దిలోనుండి విడుదలపొందితే నది వెళ్ళి సముద్రంలో కలిసినట్లుగా మనం బ్రహ్మంలో ఐక్యమవుతాము. మనో నిగ్రహం లేనివాడు, అంతఃకరణశుద్ధిలేనివాడు, ఇంద్రియ నిగ్రహంలేనివాడు

రూపబుద్ధిలోనుండి, నామబుద్ధిలోనుండి బయటపడలేడు. మనం పొందవలసినదంతా మన హృదయంలోనే ఉందికాని దేహాభిమానంవలన అది ఎక్కడో ఉంది అని మనం అనుకొంటున్నాము. మనదేహం కల్పితమే, దేహానికి పెట్టిన పేరు కల్పితమే, మనం జీవితం పొడుగునా, ఈ దేహం మరణించేవరకూ ఈరెండింటి చుట్టూ తిరుగుతున్నాము. ఎవడి మాట, మనస్సు, చేత ఏకంగా ఉందో, ఎవడైతే పరిశుద్ధుడో వాడికి మాత్రమే లోపలఉన్న వస్తువు ఎరుకపడుతుంది. ఏ జీవుడిపట్ల ఆ వస్తువుకు ప్రీతి కలిగిందో వారికి మాత్రమే అది తెలియబడుతుంది. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే, అసలు ద్వైతంలేదు. ఆచార్యులవారు ఏమని చెప్పారు అంటే నీకు తాడు పాముకింద కనబడుతోంది. అది పాముకాదు తాడే అని నీకు అర్థమయినప్పడు పాముతాడులో కలిసిపోతుంది అలాగే నీకు ఆత్మజ్ఞానం కలిగిన తరువాత ఈ ప్రపంచం అంతా నీలో ఐక్యమయిపోతుంది, నీకంటే భిన్నంగా ఏమీకనబడదు అని చెప్పారు. కోరిక ఉన్నవాడు ఆకోరికను నెరవేర్చుకోవటం కోసం ఎలా పనిచేస్తాడో జ్ఞాని లోకక్షేమం కోసం అలాపనిచేస్తాడు. దేహాభిమానంలో నుండి విడుదల పొందటానికి ఏమార్గం మంచిదని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. భక్తిమార్గం, కర్మమార్గం, ధ్యానమార్గం ఇలా అనేకమార్గాలు ఉన్నాయి. పూర్వజన్మ సంస్కారాన్ని బట్టి ఒక్కొక్కరు ఒకోమార్గానికి ఆకర్షింపబడతారు. మనం పూర్వజన్మలో ఏదైనా సాధనచేసాము అనుకోండి, ఏమార్గంలో అయితే సాధనచేసామో ఆమార్గానికి ఈజన్మలో ఆకర్షింపబడతాము. మీకు ఇష్టమైన మార్గంలో ప్రమాణంచేయండి కాని మీ మనస్సును తీసుకొనివెళ్ళి హృదయగుహలో ఐక్యం చేయండి. మీరు అతిగా ఇతరుల గొడవలలో జోక్యం చేసుకోవద్దు అని భగవాన్ చెప్పారు భగవంతుడి మాటను ప్రమాణంగా పెట్టుకొని జీవించండి.

అంతా ఈశ్వరసంకల్పాన్ని బట్టి జరుగుతోంది. అనుకొనేది మన సంకల్పం, జరిగేది ఈశ్వరసంకల్పం అని భగవాన్ చెపుతున్నారు. ఈ వాక్యం చాలాకాలం నుండి చదువుతున్నాము మాకు అర్థమవ్వటంలేదు, చదవగా చదవగా ఇది అబద్దం అని మాకు అనిపిస్తోంది. అంతా ఈశ్వరసంకల్పాన్ని బట్టి జరుగుతోంది అని ఆయన చెప్పారు కాని మాకు కారణం నిజం అనిపిస్తోంది, ఈశ్వరసంకల్పం నిజం అనిపించటంలేదు అని అడుగుతున్నారు. ఈ కారణం కూడా భగవంతుడే అని మాకు అర్థం అవ్వటంలేదు. రాముడి పట్టాభిషేకానికి ముహూర్తం పెట్టారు. రాముడికి పట్టాభిషేకం అవ్వలేదు కాని అరణ్యవాసానికి వెళ్ళాడు. ఎందుకు? మంథర ఏదోకైకకు చెప్పటం, కైక ఏదో దశరధుడిని అడగటం, ఇక్కడ మందర, కైకేయి కారణమనిపిస్తున్నారు. కాని మంధర, కైకేయికారణంకాదు. రాముడి శరీరం ఏపనిమీద అయితే వచ్చిందో ఈ పని జరిపించటంకోసం ఈశ్వరుడు అక్కడ మందర హృదయంలో, కైకేయి హృదయంలో ఉండి ప్రేరణ ఇస్తున్నాడు. ఆ ప్రేరణ ఈశ్వరసంకల్పంలో



నుండి వస్తోంది అదితెలియక ఈమందర, కైకేయి కారణం అనుకొంటున్నాము. అది నిజం కాదు, ఆకారణంకూడా ఈశ్వరుడే ఇది మీరు అర్థం చేసుకోవాలి. అక్కడ ఉన్నవాడు ఈశ్వరుడే, చేసేది అంతా ఆయనే కాని మనం ఏమనుకొంటున్నాము అంటే ఆయనలేడు మనం ఉన్నాము అనుకొంటున్నాము. శరణాగతి చెందినవాడికి రెండు ఉండదు, ఉన్నది ఆయనే, అంతా భగవంతుడే అని తెలుస్తుంది. ద్వైతంలో నుండి ద్వేషం, భయం, కోరిక, అశాంతి అన్నీవస్తాయి. ద్వైతం నశించిన వెంటనే వాడికి అభయస్థితి కలుగుతుంది, అదే మోక్షం, మనకు ఆగ్రహం ఉంది కాని నిగ్రహంలేదు. ఒకోసారి మనం అనుకొన్నవి అవ్వవు, ఒకోసారి అనుకొన్నవి అన్నీ అయిపోతూ ఉంటాయి. మనం అనుకొన్నవి అవ్వకపోవటం కూడా మన మంచికోసమే భగవంతుడు అలా చేస్తున్నాడు అని తెలిస్తే ఆగ్రహంరాదు. మన జీవితాన్ని ఎప్పడు, ఎక్కడ, ఎలా మలుపు తిప్పాలో ఈశ్వరుడు చూసుకొంటూ ఉంటాడు. మనం ఆయనకు శరణాగతి చెందాలి. శరణాగతి చేసినవాడికి శక్తి కలుగుతుంది. ఎక్కడైతే శక్తి ఉందో అక్కడ జ్ఞానం ఉంటుంది, ఎక్కడైతే జ్ఞానం ఉందో అక్కడ శక్తి ఉంటుంది. మనకు నేను అనే తలంపు ఉంది. అదే మూలతలంపు. మనకు ఎన్ని సమస్యలు వచ్చినా ఈదేహగతమైన నేనుకే. దేహం మరణించిన తరువాత ప్రయాణం చేసేది కూడా ఇదే. అందుచేత దేహం ఉండగానే ఈ దేహంతో తాదాప్యం పొందే నేనును దాని మూలంలోనికి తీసుకొనివెళితే, అది దానిమూలాన్ని చూసిన వెంటనే అది నశిస్తుంది, అప్పడు హృదయంలో ఉన్న శాంతి వచ్చి నీసహస్రారాన్ని ముంచుతుంది. ఆత్మానందం అంటే ఏమిటో అప్పడు నీకు తెలుస్తుంది. ఆత్మానందం నీకు దొరికినప్పడు ఇంక ఆనందం కోసం బయట వ్యక్తులమీద, పరిస్థితులమీద ఆధారపడవలసిన పనిలేదు. అప్పడు మనం స్వతంత్రులమవుతాము. ఆత్మసుఖం మీకు అనుభవంలోనికి వచ్చినప్పడు దానితో సమానమైన సుఖం ఇంకోటిలేదు అని మీ హృదయంలో స్ఫురిస్తూ ఉంటుంది. నీభక్తి నిజమైతే, శరణాగతి నిజమైతే భగవంతుడు నిన్ను విడిచిపెట్టడు.

ఈ లోకంలో అనేకరకాల మనుషులు ఉంటారు, రకరకాల సంఘటనలు జరుగుతూ ఉంటాయి, వీటి అన్నింటి మధ్య నీవు వికారంలేకుండా ఉండాలి. మనం ట్రైనింగ్ పొందటానికి ఈ భూమిమీదకు వచ్చాము. ఇన్ని వికారములమధ్య నిర్వికారంగా ఉండగలిగితే ఇన్ని విషయాల మధ్య నిర్విషయంగా ఉండగలిగితే లోపల నిరాకారంగా ఉన్న వస్తువు మనకు అనుభవంలోనికి వస్తుంది. మన దుఃఖానికి కారణం నేను, నాది. ఈ దేహం భూమి మీద తిరుగుతున్నప్పడే ఈ రెండింటిలోనుండి ఎవడైతే విడుదలపొందాడో వాడికి దుఃఖస్పర్శ ఉండదు. ఈ రెండు అంతతేలికగా మనలను విడిచిపెట్టవు. మనకు ఇష్టమైనవారు కనబడితే ఒకలాగ ఉంటాము ఇష్టంలేనివారు కనబడితే ఒకలాగ ఉంటాము. లాభం వచ్చినప్పడు

ఒకలాగ ఉంటాము. నష్టం వచ్చినప్పుడు ఒకలాగ ఉంటాము, ఉపకారం చేసినవాడు కనబడితే ఒకలాగ ఉంటాము, అపకారం చేసినవాడు కనబడితే ఒకలాగ ఉంటాము. ఇన్ని అవతారాలు ఎత్తుతూ ఉంటే అవి రెండూ మనలను ఎలా విడిచిపెడతాయి, విడిచిపెట్టనే విడిచిపెట్టవు. ఈ రెండూ ఉన్నవాడు దుఃఖంలో నుండి విడుదలపొందే అవకాశంలేదు. నీకులాభం వచ్చినప్పడు పొంగిపోతావు, నష్టం వచ్చినప్పడు కృంగిపోతావు. అప్పడు నీకు దేహాభిమానం పెరిగిపోతుంది. నువ్వు ఎలాగ ఉండాలంటే ఇతరులకు లాభం వచ్చినప్పడు నీకు ఏమి అనిపించదు, ఇతరులకు నష్టం వచ్చినప్పడు నీకు ఏమీ అనిపించదు. నీ స్వవిషయంలో కూడా అలాగే ఉండు అప్పడు నీమనస్సు అణిగిపోతుంది, దేహంతో తాదాప్యం పొందేబుద్ధి నశిస్తుంది, దేహాభిమానం నశిస్తుంది, నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. అలాలేకుండా, ఒక క్రమశిక్షణ లేకుండా, ఏదో కొంతలాభం వస్తే పొంగిపోయి ఎగిరిఎగిరి పడిపోవటం మరల కొంత నష్టంవస్తే కుంగిపోయి మంచం పట్టేయటం ఇంత పిరికివాడికి, ఇంత బలహీనుడికి ఆత్మజ్ఞానం ఎలా కలుగుతుంది? కలుగనే కలుగదు అని చెప్పటం.

మనం గతాన్ని మర్చిపోవాలి, వర్తమానకాలాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. అప్పడు భవిష్యత్‌కాలం మనకు అనుకూలమవుతుంది. పిల్లలు కష్టపడి ఎలా చదువు సంపాదించుకొంటున్నారో, లౌకికులు లోకంలో గొప్పలకోసం, గౌరవాలకోసం ఎలా కష్టపడుతున్నారో అలాగ భక్తులు ఈశ్వరునిదయను పొందటానికి కష్టపడి ప్రయత్నం చేసుకోవాలి. ఈశ్వరుని దయను ఎలా పొందగలము అంటే ఈశ్వరుని వాక్యంయందు మనకు నమ్మకం కలగాలి, ఆయన చెప్పినమాట ప్రకారం మనం జీవించాలి అప్పడు ఆయన దయకు మనం పాత్రులవుతాము. యోగికానివాడు జ్ఞానికాలేడు. యోగం అంటే జీవుడిని ఆత్మని ఒకటి చెయ్యాలి అలాచేస్తే దానిని సమాధిస్థితి అంటారు, ఒక్కటిగా ఉండటమే సమాధిస్థితి, ఆసమాధిస్థితి నీకు కలిగినప్పడు ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది. మనకు ఎప్పడైనా ఉద్రేకం వస్తుంది, వచ్చినప్పడు అదే మనం అనుకొంటాము, నేను ఆత్మను అన్న సంగతి మర్చిపోతాము, ఆఉద్రేకమే నేను అనుకొని దానితో తాదాప్యం పొందుతాము, అదేమాయ, మనకు ఏదైనా దుఃఖం వస్తోంది అనుకోండి, మనకు ఉద్రేకం వస్తోంది అనుకోండి లోపల మీకు తెలియకుండా ఏదోకోరిక ఉందని అర్థం. మీరు ప్రశాంతంగా కూర్చొని చూసుకోండి. మనం అనుకొన్నపని అయిపోతే సంతోషంగా ఉంటాము, అనుకొన్న పని అవ్వకపోతా డీలా అయిపోతాము, దుఃఖం వస్తుంది. భగవంతుడు ఏమి చెపుతున్నాడు అంటే నువ్వు పనిచెయ్యి, అది నువ్వు అనుకొన్నట్లుగా జరగవచ్చు లేకపోతే జరగకపోవచ్చు. జయం, అపజయం అనేది నీదేహప్రారబ్ధాన్ని బట్టి ఆధారపడి ఉంటుంది. మనం పని అయితే ఒకరకంగా, పని అవ్వకపోతే ఒక రకంగా ఉంటాము. అలాకాదు నీవు పని చేస్తున్నావు కదా పనిచేసేటప్పడే, ఆపనిలోనే సంతోషించు పని జరిగిన తరువాత ఎంత సంతోషిస్తున్నావో అలాగ పనిలోనే సంతోషించు. ఎంజాయ్ దిగేమ్, పనిలోనే ఎంజాయ్‌చేయటం నేర్చుకో. అప్పడు నీకు పని పూర్తి అవుతుంది, నీకు జ్ఞానం కలుగుతుంది. జయమనేది, అపజయమనేది నీచేతిలోలేదు, అది ఈశ్వర నిర్ణయం ప్రకారం జరుగుతుంది. ఈశ్వరుడు జీవులను వారివారి ప్రారబ్దముననుసరించి ఆడిస్తున్నాడు. జరగవలసినది జరిగే తీరును, జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసినా జరుగనే జరుగదు. దేవుడు మనకళ్లకు కనబడడు కాని ఉన్నాడు. ఏ జీవుడుని ఎప్పడు ఎక్కడ కూర్చోబెట్టాలో అక్కడ కూర్చోబెడతాడు, వాడు నియంత. మీరు ఒక మనిషిని పతనం చెయ్యాలి అనుకొన్నారు అనుకోండి, వాడి మీద దేవుని అనుగ్రహం ఉంటే వాడిని తీసుకొని వెళ్లి ఉన్నతస్థానంలో కూర్చోబెడతాడు మనం ఏమి చెయ్యగలము.

ఒకసారి శ్రీ కృష్ణదేవరాయలు సభలో మాట్లాడుతూ ఇక్కడమోక్షానికి వెళ్లేవారు ఎవరైనా ఉన్నారా అని అడిగాడు. అక్కడ పండితులు, భక్తులు, కవులు ఉన్నారు ఎవరూ మాట్లాడటంలేదు. అప్పడు తెనాలి రామకృష్ణుడు లేచి ఇప్పడు నేను నేను అంటున్నాను, ఈ నేను అనే బుద్ధి ఇంకా నాకుపోలేదు. నువ్వు మోక్షానికి వెళతావా అని మీరు అడుగుతున్నారు. ఈశరీరం చనిపోయేలోపు ఈ నేను అనే బుద్దిపోతే మీరు చెప్పినచోటికి పోతాను అన్నాడు అంటే మోక్షానికి వెళతాడు. మీరు మనస్సును విశ్లేషణ చేసుకొంటే ఏమిలేదు. అంతా మనస్సే, గాఢనిద్రలో మనస్సులేదు అందుచేత అక్కడ ఏమిలేదు. మనస్సు ఉంటే అంతాఉంది, అదిలేకపోతే ఏమిలేదు చివరకు నువ్వు మిగులుతావు. ఎక్కడైతే మనస్సు అణిగిందో అక్కడ మనం ఏదిగా ఉన్నామో అది స్వరూపంగా వ్యక్తమవుతుంది. అదే నారాయణ స్వరూపం. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని విశ్వసించటం నేర్చుకో. నీకు ఏదైనా మంచి జరిగితే అది ఈశ్వర ప్రసాదం, నీకు పరిస్థితులు ప్రతికూలంగా ఉంటే అదికూడా ఈశ్వరప్రసాదమే. మనం కుండలు కొన్నప్పడు ఇలాకొట్టి చూస్తాము. అది ఖంగుమనాలి లేకపోతే దానిని మట్టిలో పడేస్తారు. అలాగే భగవంతుడు ఏమి చేస్తాడు అంటే కావాలనే మనకు అనుకూలపరిస్థితులు, ప్రతికూలపరిస్థితులు పెడతాడు. మనకు అనుకూల పరిస్థితులు ఉన్నప్పడు మనం ఎలా ఉన్నామో, ప్రతికూలపరిస్థితులు ఉన్నప్పడు మనం ఎలా ఉన్నామో చూస్తూఉంటాడు. కుండను కొట్టినట్లుగా అప్పడూ కొడతాడు, ఇప్పడూ కొడతాడు మనం ఎలా ఉన్నామో చూస్తాడు. అనుకూలపరిస్థితులు ఉన్నప్పడు మనం ఎగిరి ఎగిరిపడతాము, ప్రతికూలపరిస్థితులు వచ్చినప్పడు ఏడుస్తూ కూర్చొంటాము అప్పడు మనలను తీసుకొనివెళ్లి మట్టిలోపడేస్తాడు అంటే పునర్జన్మలో పడేస్తాడు. జయాపజయాలను సమానంగా చూసుకొంటున్నామని నోటితో చెపుతున్నాము అనుకోండి

కాని మనస్సులో అలా చూసుకోవటం లేదు అనుకోండి అది కూడా భగవంతుడు చూస్తూ ఉంటాడు. ఎందుచేతనంటే ఆయన మన హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు కదా. జయాపజయాలను సమానంగా చూసుకోకపోతే మనలను పునర్జన్మలోపడేస్తాడు. నేను నా అహంకారంకోసం పనిచేస్తున్నానా? ఈశ్వరుడికోసం పనిచేస్తున్నానా? నోటితో ఈశ్వరార్పితం అంటాను కాని లోపల అహంకారార్పితం అంటాను అంటే చేసేది అహంకారం కోసం చేస్తున్నాను. అప్పుడు తీసుకొనివెళ్ళి మట్టిలో కలిపేస్తాడు. మనంలోకాన్ని మోసం చేయగలము కాని ఈశ్వరుడిని మోసం చేయలేము. నీ నోటితో చెప్పే మాటవలన మోసపోయేటంత అమాయకుడుకాదు భగవంతుడు, మనకంటే తెలివిగలవాడు. కొంతమంది మేము చాలా తెలివైనవారము అనుకొంటారు అలా అనేది ఎవరు? నీ అహంకారం అంటోంది. ఆ తెలివి నీఅహంకారాన్ని పెంచటానికి పనికివస్తుంది. నిజమైన తెలివైనవాడు ఎవడు నేను తెలివైనవాడిని అని అనుకోడు. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు. ఆయన మనకంటే వివేకవంతుడు, ప్రజ్ఞావంతుడు, మనకేది మంచిదో మనకంటే ఆయనకు ఎక్కువ తెలుసు, ఈ విషయం మీరు మర్చిపోవద్దు. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని మీరు పరిపూర్ణంగా విశ్వసించండి అన్నీ కండిషన్‌లో పడిపోతాయి. మనం నోటితో చెప్పేమాటను మన మనస్సు అంగీకరించటంలేదు. మనం ఎవరిని మోసం చేస్తాము. మన నోటికి మనస్సుకు చాలాదూరం ఉంది, ఇంక మనకు జ్ఞానం ఏమిటి?

మనం ఏదైనా మంచిపని చేస్తున్నాము అనుకోండి, ఆపని సంతోషంగా చెయ్యాలి, నిర్మలంగా చెయ్యాలి, శాంతిగా చెయ్యాలి, భక్తిగా చెయ్యాలి, ప్రచారంకోసం చేయకూడదు. మనం ఏదైనా పనిచేస్తే దానివలన మనకు శాంతి కలగాలి, ఇతరులకు శాంతి కలగాలి, మనకు ఆనందం కలగాలి ఇతరులకు ఆనందం కలగాలి, పని ఇలాచేస్తే మనకు భగవంతుని దయ కలుగుతుంది. ప్రచారం కోసం పనిచేస్తే దానివలన గౌరవం వచ్చినా భగవంతుని దయకు దూరమవుతాము. మనం చేసే పనివలన మనకు మనోనిగ్రహం రావాలి, ఈశ్వరుని దయ రావాలి. ఇతరులను మనం అనుసరించకూడదు. భగవంతుడి వాక్యాన్ని ఎదురుగా పెట్టుకొని అలా జీవించటం నేర్చుకోవాలి. ఇతరుల గొడవ మనకు అనవసరం. అహంకారానికే ఇతరులు ఉన్నారు, ఆత్మకు ఇతరులులేరు, పేచీలు వచ్చినప్పుడు మనకు చేతనయితే సమాధానపరచటానికి ప్రయత్నం చేయాలి కాని ఆపేచీ పెంచకూడదు, దానివలన హృదయశుద్ధి కలుగుతుంది. హృదయశుద్ధి కలవారు ధన్యులువారు దేవుని చూచెదరు అని బైబిలులో చెప్పారు. మీ కుడిచేతిలో ఉన్న వస్తువు ఎడమచేతికి ఇస్తావు అనుకో, ఎవరికో ఏదో చేసాను అని నీవు అనుకోవు ఎందుచేతనంటే రెండుచేతులు నీవేకాబట్టి. అంతానువ్వేకాబట్టి నువ్వు సమాజానికి ఏది చేసినా అలాగే ఉండాలి. అప్పుడు వేరుబుద్ధి నశిస్తుంది, జ్ఞానానికి అర్హతయోగ్యత కలుగుతుంది. కృష్ణుడు గీతలోనేను అంటాడు. ఆ నేను చైతన్యగతమైన నేను. చైతన్యానికి తెలివితోటి, మనస్సుతోటి దేనితోటి పనిలేదు. అది స్వతంత్రమైనది. ముక్కులో గాలిపోతే ఈ శరీరం పోతుంది కాని చైతన్యానికి ఈ గాలితో పనిలేదు. ఈసృష్టి లేనప్పడు, పంచభూతాలు లేనప్పడు ఏదైతే ఉందో అదే చైతన్యం. అది ఎవరు అనుకొంటున్నావు? అది నీవై ఉన్నావు, దాని తాలుక అనుభవం పొందు. చైతన్యం నీహృదయంలో ఉంది, ఈ శరీరంతో దానికి ఇసుమంతయు సంబంధంలేదు. నువ్వు సర్వవిధముల ప్రయత్నంచేసి గురువును ఆశ్రయించి, శాస్త్రమును ఆశ్రయించి, భగవంతుడి దయను పొంది చైతన్యానుభవం పొందటానికి ప్రయత్నంచెయ్యి, చైతన్యానుభవం పొందాక నీకు తెలుస్తుంది నీ హృదయంలో ఉన్నదే అంతటా వ్యాపించి ఉంది, అదీ ఇదీ ఒక్కటే అని నీకు తెలుస్తుంది. అదే నీకడసారిజన్మ. మనకు ఉన్నది చిన్న తెలివి, మనం కిరసనాయిలు దీపంలాంటి వారము, కిరసనాయిలు దీపాన్ని దృష్టిలో పెట్టుకొని చైతన్యం గురించి ఆలోచిస్తే ఎలాగ? ఈదీపం ఎప్పుడు ఆరిపోతుందో తెలియదు. ఈదీపాన్ని ఆధారంగా పెట్టుకొని చైతన్యాన్ని కొలుస్తాను అంటావు ఏమిటి? అసలు నీవు ఎంతటివాడవు. మనం పుట్టకముందు ఈ సృష్టి ఉంది. మనం మధ్యలో వచ్చాము, కొంతకాలం అటుఇటు తిరుగుతాము, మరల మట్టిలో కలిసిపోతాము. మన మనస్సుతో గ్రహించే విద్యలు అన్నీ మిధ్యావిద్యలు, అవి పొట్టకే పరిమితం. చదువవలెను, చదువవలెను చావులేని చదువుచదవవలెను అన్నాడు ప్రహ్లాదుడు. ఆత్మజ్ఞానులతోటి సహవాసం కంటే మించిన భాగ్యం ఏముంది అన్నారు పరమహంస. వారి సమక్షంలో కూర్చొంటే మీకు కూడా ఆత్మజ్ఞానం సంపాదించాలనే బుద్ధి కలుగుతుంది, అంతకుమించిన భాగ్యంలేదు. ఆత్మజ్ఞానమే సంపద, ఆత్మజ్ఞానమే లక్ష్మి, ఆత్మజ్ఞానమే ఆనందం, ఆత్మజ్ఞానమే అమృతం, అదే నిర్వాణస్థితి. నిన్ను మాయచేయటానికి ఒకోసారి అదృష్టంతో కప్పతాడు. అప్పుడు నీవు అవినయం తెచ్చుకోవద్దు, గర్వం తెచ్చుకోవద్దు అదృష్టం వచ్చినా నీవు గర్వంలేకుండా ఉన్నావు అనుకో మనం ఇన్ని ఇచ్చినా మాయలోపడకుండా ఉన్నాడు. గర్వంలేకుండా ఉన్నాడు, అవినయంలేకుండా ఉన్నాడు, ఈ బాహ్యపదార్ధముల మధ్యలో ఉండి వాటితో తాదాప్యం లేకుండా ఉన్నాడు అని నిన్ను మట్టిలో కలపటం మానేసి, తన స్వరూపాన్ని ఇచ్చేస్తాడు. ఒకోసారి మనకు ఉన్నవి ఊడగొడతాడు, ప్రతికూలపరిస్థితులను కల్పిస్తాడు. అప్పుడు మనం కుంగిపోకుండా ఉన్నాము అనుకోండి, వీరు చాలా నార్మల్‌గా ఉన్నారు, నేచురల్‌గా ఉన్నారు, కష్ట సుఖాలను సమానంగా తీసుకొంటున్నారు అని మనలను మట్టిలో కలపటం మానివేసి ఆయన స్వరూపాన్ని ఇస్తాడు, అదేమోక్షం.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

15-07-2004 గురువారం జిన్నూరు శ్రీ రమణక్షేత్రం



చింతపర్రు గ్రామంలో **శ్రీ పెన్మెత్స శ్రీనివాస చంద్రశేఖర్‌వర్మ, పద్మావతి** దంపతులచే నూతనంగా నిర్మించిన **షిరిడీ సాయినాధుని** విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ సందర్భంగా సాయినాధునికి పాలాభిషేకం చేస్తున్న సద్గురు శ్రీనాన్నగారు




**జిన్నూరు శ్రీ రమణక్షేత్రంలో గురుపూర్ణిమ మహోత్సవములో**
**సద్గురు శ్రీ నాన్నగారు**

05-07-2004



గురుపూర్ణిమ సందర్భముగా సద్గురు శ్రీనాన్నగారిని సన్మానిస్తున్న శ్రీరమణక్షేత్రం అధ్యక్షుడు **శ్రీ పి.యస్.యన్. రాజు**, కార్యదర్శి **శ్రీ పి. శ్రీరామరాజు**




**హైదారాబాదు వాస్తవ్యులు శ్రీ రామకృష్ణంరాజు, లక్ష్మీ దంపతులచే**
**“గురుపూజ”**